సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం | 27 | డిసెంబర్ | 2024




ఎవరా పెద్దాయన..!
కరప మండలం విజయరాయుడుపాలెంలో కోడిపందేల బరి ఏర్పాటుపై సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్న ఫోను సంభాషణ చర్చనీయాంశంగా మారింది.

10లో



పాత నేరస్తులపై నిఘా
పాత నేరస్తులపై నిరంతరం నిఘా పెడుతున్నామని, దీనివలన మంచి ఫలితాలు వస్తున్నాయని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్ తెలిపారు.

డెల్టాలకు నీటి విడుదల


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 9,745 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.35 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఎస్సీ, ఎస్టీలపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు

అమలాపురం రూరల్: ఎస్సీ, ఎస్టీలపై అన్యాయంగా దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ నిఘా పర్యవేక్షణ జిల్లాస్థాయి కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద నమోదైన కేసులు సత్వరమే పరిష్కరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు అఘాయిత్యాల సమాచారాన్ని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి, పరిశీలించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా 95 కేసులు నమోదు కాగా బాధితులకు రూ.81.25 లక్షలు చెల్లించాల్సి ఉండగా రూ.30 లక్షలు ఇటీవల మంజూరు అయ్యాయన్నారు. కోనసీమ జిల్లాకు ఎస్సీ ఎస్టీ కోర్టు మంజూరు అయిందని తెలిపారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ పోలీస్ అధికారులు తమ స్టేషన్లకు వచ్చిన ఫిర్యాదులపై రాజీ చేస్తుండడంతో అవే కేసులు పునరావృతం అవుతున్నాయని చెప్పారు. కలెక్టర్ టి.నిషాంతి, అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, ఆర్డీవోలు కే. మాధవి పి.శ్రీకర్ డీ.అఖిల, జిల్లాస్థాయి అధికారులు, డీఎస్పీలు పాల్గొన్నారు. సహజ వాయువుల సంస్థల కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అంచనాలు రూపొందించాలని వివిధ శాఖల ఇంజినీర్లను కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సీఎస్ఆర్ నిధులు మంజూరు, కేటాయింపుల అంచనాల రూపకల్పనపై అధికారుతో చర్చించారు. సీపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ పి.రామకృష్ణారెడ్డి, పీఆర్ డీఈఈ పీఎస్ రాజ కుమార్, ఆర్‌డబ్ల్యూ ఎస్ఈ సీహెచ్ ఎన్వీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

హిందువులు ఏకం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమలానంద భారతి స్వామి

అమలాపురం టౌన్: హిందువులంతా ఏకం అయ్యే సమయం ఆసన్నమైందని, హైందవ శంఖారావం ద్వారా హిందువుల ఐక్యతను చాటాలని విజయవాడ భువనేశ్వరి పీఠం స్వామీజీ కమలానంద భారతిస్వామి పిలుపునిచ్చారు. విజయవాడలో జనవరి 5న జరగనున్న హైందవ శంఖారావం మహాసభకు సన్నద్ధమయ్యే అంశంపై స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో గురవారం రాత్రి జరిగిన సమావేశంలో స్వామీజీ మాట్లాడారు. దేవాలయ వ్యవస్థ గాడిన పడాలంటే హిందువులంతా దేవాలయాలను నిర్వహించుకునే సన్నద్ధత పెంచుకోవాలన్నారు. దేవాలయాలను ప్రభుత్వం గుప్పిట్లోంచి విడిపించుకోవాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో దేవాలయాలను ప్రైవేటుగా ఒక్క రూపాయి టిక్కెట్ లేకుండా నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ఆర్ఎస్ఎస్ సంఘ చాలక్ డాక్టర్ గోదశి గంగరాజు, విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, బజరంగ్ దళ్ రాష్ట్ర సహాయ ప్రముఖ్ శిరంగు నాయుడు, పంచాంగ కర్త ఉపద్రష్ట నాగాదిత్య, కర్రా సంతోష శాస్త్రి పాల్గొన్నారు.

రుణాల సొమ్ము స్వాహాపై ఫిర్యాదు

అమలాపురం రూరల్: పాలగుమ్మి గ్రామంలోని డ్వాక్రా సంఘాల మహిళల సొమ్మును స్వాహా చేసిన ఘటనపై అమలాపురం తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రూ.21.48 లక్షలు స్వాహా చేశారని అమలాపురం తాలూకా పోలీసులకు ఏపీఎం అయితాబత్తుల సురేంద్ర గురువారం ఫిర్యాదు చేశారు. గత సంవత్సర కాలంలో మహిళా సంఘాల శ్రీనిధి, బ్యాంకు రుణాల సొమ్ము వీవోఏలు స్వాహా చేశారు. ఈ స్వాహా వ్యవహారాన్ని అధికారులు అక్టోబర్ నెల తనిఖీల్లో గుర్తించారు. నెలలు గడిచినా సొమ్ము రికవరీని మండల మహిళా సమాఖ్య అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు గత నెలలో కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ అందించారు. డీఆర్‌డీఏ పీడీ శివశంకరప్రసాద్ ఈ వ్యవహారంపై తక్షణం పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఏపీఎం అయితాబత్తుల సురేంద్రను ఆదేశించారు. తాలూకా ఎస్సై ఎం.శేఖరబాబుకు యానిమేటర్లపై ఫిర్యాదు చేశారు. గ్రామంలోని అన్ని డ్వాక్రా సంఘాల నుంచి సొమ్ము వసూలు చేసి బ్యాంకులకు జమ చేయకుండా వివిధ కేటగిరీలకు చెందిన నిధులను స్వాహా చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. డ్వాక్రా యానిమేటర్లుగా పనిచేస్తున్న కనకమహాలక్ష్మి రూ.13,27,445, కొల్లు వెంకటలావణ్య రూ.8,21,384 నిధులను స్వాహా చేసినట్టు ఫిర్యాదులో వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గతంలో పేరూరు గ్రామానికి చెందిన వీవోఏ రూ.లక్షలు స్వాహా చేసిన ఘటనపై అప్పట్లో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లూటీ చార్జ్



- విద్యుత్ వినియోగదారుల నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వం
- వివిధ చార్జీల పేరుతో బాదుడు
- త్వరలో మరింత పెంచేందుకు ప్రణాళికలు
- ఆక్వా రైతుల రాయితీ విద్యుత్‌కు షాక్
- ప్రభుత్వ తీరుకు నిరసనగా నేడు వైఎస్సార్ సీపీ ధర్నా
- నియోజకవర్గ కేంద్రాలలో నిర్వహణ

జిల్లాలో విద్యుత్ వినియోగం

గృహ సర్వీసులు	16,94,762
వాణిజ్య సర్వీసులు	1,96,588
పరిశ్రమల సర్వీసులు	6,289
కుటీర పరిశ్రమలు, వీధి దీపాలు	42,023
వ్యవసాయం	64,344
హెచ్‌టీ సర్వీసులు	1,767
మొత్తం వినియోగదారులు	20,05,773



ఈదరపల్లిలోని ఏపీ ఈపీడీసీఎల్ సబ్ స్టేషన్

సాక్షి, అమలాపురం: 'వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను ఇబ్బందుల పాల్జేస్తోంది. మమ్మల్ని గెలిపించండి... మేము చార్జీలు పెంచం. అవసరమైతే విద్యుత్ చార్జీలు తగ్గిస్తాము' అని ఎన్నికల సభలో ఊదరగొట్టిన చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే తన తడాఖాను చూపిస్తున్నారు. కొత్త సంవత్సరం నుంచి విద్యుత్ చార్జీలు పెంచేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వివిధ పద్ధతుల్లో దొడ్డిదారిన చార్జీలు పెంచి వినియోగదారులు నడ్డివిరుస్తున్నారు. దగాపడ్డ వినియోగదారులకు దన్నుగా ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ శుక్రవారం 'విద్యుత్ చార్జీల బాదుడుపై పోరుబాట' చేయనుంది.

చార్జీల రూపంలో అదనపు భారం

విద్యుత్ శాఖ కొనుగోలు చేసే ఇంధనం, విద్యుత్ కొనుగోలు వ్యయ సర్దుబాటు (ఎఫ్‌పీపీసీఏ)ను వినియోగదారులపై వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరిలో ట్రూ-అప్ చార్జీలు వసూలు చేస్తున్నారు. విద్యుత్ వాడకం అయ్యే యూనిట్ల మీద కాకుండా ఇలా వివిధ రకాల చార్జీల రూపంలో వినియోగదారులపై అదనపు భారం మోపుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఇంధన విద్యుత్ కొనుగోలు చార్జీలను ఇప్పుడు వసూలు చేస్తున్నారు. 2022 జూలై నుంచి డిసెంబర్ వరకు, తిరిగి 2023 జనవరి ఇంధన కొనుగోలు చార్జీలను ఈ ఏడాది సెప్టెంబర్ నెల వరకు యూనిటకు రూ.1.55 పైసలు చొప్పున భారం మోపారు. ఫిబ్రవరి 2023 ఇంధన విద్యుత్తు కొనుగోలు చార్జీలను ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో రూ.1.55 చొప్పున, 2023 మార్చి చార్జీలను ఈ ఏడాది డిసెంబర్, వచ్చే ఏడాది జనవరి నెలలో రూ.1.55 చొప్పున వసూలు చేయనున్నారు. ఈ చార్జీలను కూటమి ప్రభుత్వం రెండు మూడు నెలల బిల్లులలో జమ చేస్తున్నందున యూనిట్‌పై 50 నుంచి 70 పైసలు మాత్రమే బిల్లు పడుతున్నట్టు అవుతుంది. ఈ కారణంగా సర్దుబాటు చార్జీలు వినియోగదారులకు పెద్ద భారంగా అనిపించడంలేదు. కానీ ఏపీ ఈపీడీసీఎల్ అధికారులు మాత్రం వినియోగదారుల జేబులకు పెద్దగానే చిల్లు పెడుతున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ పోరు బాట

ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచేది లేదని మాట ఇచ్చి.. ఇప్పుడు దొడ్డిదారిన విద్యుత్ చార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ పోరాటానికి సిద్ధమైంది. 'విద్యుత్ చార్జీల బాదుడుపై పోరుబాట'కు సిద్ధమైంది. దీనిలో భాగంగా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల కేంద్రాలలో నిరసన ప్రదర్శనలు, విద్యుత్ కార్యాలయాల వరకు ర్యాలీలు నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రమైన అమలాపురంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో కరెంట్ బిల్లుల బాదుడుపై శుక్రవారం ఉదయం ఈదరపల్లి ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద నిరసన చేపడతారు. తొలుత అమలాపురం హైస్కూల్ సెంటర్ నుంచి ట్రాన్స్‌కో కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహిస్తారు. పి.గన్నవరం కోఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో పి.గన్నవరం పెట్రోల్ బంకు వద్ద నుంచి సబ్ స్టేషన్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహిస్తారు. మండపేట నియోజకవర్గ కో-ఆర్డినేటర్ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో మండపేట పట్టణం విజయలక్ష్మినగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయం నుంచి మారేడుబాక వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేస్తారు. కొత్తపేట నియోజకవర్గంలో కోనసీమ ముఖద్వారం రావులపాలెం పార్టీ కార్యాలయం నుంచి మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కొత్తపేట ర్యాలీగా వెళ్లి ఏడీ కార్యాలయంలో వినతి పత్రం అందజేయనున్నారు. రామచంద్రపురం గాంధీనగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి కో-ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ ప్రధాన రహదారి మీదుగా విద్యుత్ డీఈ కార్యాలయం వరకు పోరుబాట ర్యాలీ నిర్వహించనున్నారు. ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కాశి వాని తూము నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టనున్నారు. రాజోలు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో మలికిపురం సెంటర్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ చేసి సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు.

ఒక్క యూనిట్... రూ.80 అదనంగా బిల్లు



అమ్మిడిరెడ్డికి చెందిన నవంబర్ విద్యుత్ బిల్లు

రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన కె.అమ్మిరెడ్డికి చెందిన ఇంటికి గత నెల కన్నా ఈ నెల అదనంగా ఒక్క యూనిట్ వాడకం పెరిగింది. దీంతో ఏకంగా రూ.80 బిల్లు పెరిగింది. గత నెలలో 183 యూనిట్లు వాడగా రూ.943 బిల్లు రాగా, ఈ నెలలో 184 యూనిట్లు వాడకం కాగా రూ.1,023 బిల్లు వచ్చింది. అక్టోబర్ నుంచి నవంబర్ నెల వరకు ఎఫ్‌పీపీసీఏ- 2 చార్జీ రూపంలో రూ.67 వసూలు చేయగా, నవంబర్ డిసెంబర్‌లకు సంబంధించి ఎఫ్‌పీపీసీఏ రూ.98, ఎఫ్‌పీపీసీఏ-2 రూ.48 చొప్పున అదనంగా వసూలు చేశారు.

ఒక యూనిట్‌కు రూ.286 విద్యుత్ బిల్లు

ఐ.పోలవరం మండలం మురమళ్ళకు చెందిన ఆకెళ్ళ లక్ష్మికి రెండు విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ఒక కనెక్షన్‌పై అక్టోబర్ 4 నుంచి నవంబర్ 11వ తేదీ వరకు 43 యూనిట్లకు గాను రూ.168 బిల్లు వచ్చింది. దీనిలో ఎఫ్‌పీపీసీఏ బిల్లు రూ.31. ఇదే సర్వీస్‌కు సంబంధించి నవంబర్ 11 తేదీ నుంచి డిసెంబర్ 12 తేదీకి కేవలం ఒక్క యూనిట్ మాత్రమే విద్యుత్తు వినియోగం కాగా ఏకంగా రూ.289 బిల్లు రావడం గమనార్హం. దీనిలో ఎఫ్‌పీపీసీఏ రూ.183 కాగా, ఎఫ్‌పీపీసీఏ-2 రూ.78 కావడం విశేషం.



ఆకెళ్ళ లక్ష్మికి ఒక యూనిట్‌కు వచ్చిన రూ.286 విద్యుత్ బిల్లు

అడిషనల్ లోడ్ పేరుతో పెనుభారం



ఆక్వా చెరువులకు వాడుకుంటున్న కరెంట్‌కు ఏడాదికి ఒకసారి కట్టే అడిషనల్ లోడ్ చార్జీలు పెను భారంగా ఉన్నాయి. నా చెరువుల వద్ద ఉన్న నాలుగు ట్రాన్స్‌ఫార్మర్‌లకు గాను సర్వీస్ నెం.2670కి 2023 మే 31వ తేదీ నుంచి రూ.63,118, సర్వీస్ నెం .2619కి 2018 అక్టోబర్ 9వ తేదీ నుంచి రూ.17,300 కట్టాలని తాఖీదులు ఇచ్చారు. బిల్లు కంటే ముందు అడిషనల్ లోడ్ కట్టకపోతే (ఏసీడీ చెల్లించకపోతే) సర్వీసును డిస్‌కనెక్ట్ చేస్తామంటున్నారు. ఆక్వా జోన్‌లతో సంబంధం లేకుండా ప్రతి ఆక్వా రైతుకు రాయితీ విద్యుత్ ఇస్తామన్నారు. జోన్‌లో ఉన్నవారికి కూడా ఇవ్వడం లేదు.

– వీరా మల్లికార్జునరావు (మల్లిబాబు), ఎంపీపీ, సఖినేటిపల్లి

అల్ట్రా స్కానింగ్ సెంటర్లపై పటిష్ట నిఘా

- లింగ నిర్ధారణ పేరుతో దుర్వినియోగాన్ని ఉపేక్షించేది లేదు
- ఆర్డీవో మాధవి హెచ్చరిక



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో మాధవి

అమలాపురం టౌన్: గర్భస్థ పిండం ఆరోగ్య పరిశీలన కోసం వినియోగించే అల్ట్రా స్కానింగ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించే స్కానింగ్ సెంటర్లపై పటిష్టమైన నిఘా పెట్టాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. లింగ నిర్ధారణను ఉపేక్షించేది లేదని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఈ పరీక్షలు నిర్వహిస్తే సదరు స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతనిధులతో లింగ నిర్ధారణ- అల్ట్రా స్కానింగ్ సెంటర్లపై గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆర్డీవో మాధవి చర్చించారు. లింగ నిర్ధారణకు పాల్పడే స్కానింగ్ సెంటర్లపై నిఘాతో పాటు డెకాయ్ ఆపరేషన్లు కూడా నిర్వహించాలని ఆమె స్పష్టం చేశారు. ఆడ శిశువుల పట్ల వివక్షతో జరిగే భ్రూణ హత్యలను నివారించేందుకు ప్రత్యేక చట్టం ఉందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షల నివారణకు నిర్దేశించిన కమిటీ ప్రతినిధులు కూడా గ్రామ స్థాయిలో అనధికారికంగా జరుగుతున్న అబార్షన్లను గుర్తించాలని సూచించారు. బాధ్యులపై లింగ నిర్ధారణ నిషేధిత చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. స్కానింగ్ సెంటర్ల రెన్యువల్ నిమిత్తం డివిజన్ స్థాయి కమిటీ ఆమోదించిన దరఖాస్తులను జిల్లా స్థాయి కమిటీకి నివేదించాలని ఆర్డీవో సూచించారు. ప్రతి స్కానింగ్ సెంటర్‌లోనూ ఈ చట్టానికి సంబంధించిన నిబంధనలతో ముద్రితమైన వాల్ పోస్టర్లను విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఆడపిల్లల పట్ల వివక్షను పూర్తిగా రూపుమాపి స్త్రీ, పురుష లింగ నిష్పత్తి సమానత్వ సాధన ద్వారా ఆరోగ్యకర సమాజం కోసం అందరూ పాటు పడాలని ఆర్డీవో సూచించారు. ప్రజల్లో కూడా ఈ చట్టం, శిక్షలపై పూర్తి అవగాహన పెంచాలన్నారు. డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ భరతలక్ష్మి మాట్లాడుతూ తరుచూ స్కానింగ్ సెంటర్ల తనిఖీలు నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ మాధురి, చిన్న పిల్లల వైద్యుడు పీవీ పృథ్వీరాజ్, రెడియాలజిస్ట్ డాక్టర్ భరత్, సీఐ పి.వీరబాబు, లీగల్ సెల్ ఎన్జీవోల ప్రతినిధులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ఫీజు చెల్లింపునకు తుది గడువు 31

రాయవరం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం(ఓపెన్ స్కూల్) ద్వారా నిర్వహించే పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజు షెడ్యూల్‌ను ఏపీ సార్వత్రిక విద్యాపీఠం డైరెక్టర్ ఆర్.నరసింహారావు విడుదల చేశారు. పరీక్ష ఫీజుల విధి విధానాలు, పరీక్షల షెడ్యూల్‌న ఏపీ సార్వత్రిక విద్యా పీఠం జిల్లా కోఆర్డినేటర్ పి.సాయివెంకటరమణ తెలిపారు. పరీక్ష ఫీజును అపరాధ రుసుం లేకుండా ఈ నెల 31వ తేదీ లోగా చెల్లించాల్సి ఉంది. అపరాధ రుసుం లేకుండా పదవ తరగతికి ఒక సబ్జెక్టుకు రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.5, పరీక్ష ఫీజుగా రూ.95 వెరసి మొత్తం రూ.100, ఇంటర్‌కు ఒక సబ్జెక్టుకు రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.5, పరీక్ష ఫీజుగా రూ.145 వెరసి రూ.150 చెల్లించాల్సి ఉంది. ప్రాక్టికల్ ఒక్కో సబ్జెక్టుకు రూ.100 చెల్లించాలి. ఇంటర్‌లో ఇంప్రూవ్‌మెంట్‌కు థియరీ ఒక్కో సబ్జెక్టుకు రూ.250, ఫెయిలైన సబ్జెక్టుకు రూ.150 వంతున చెల్లించాలి. ప్రాక్టికల్ ఒక సబ్జెక్టుకు రూ.100 చెల్లించాలి. రూ.25 అపరాధ రుసుంతో జనవరి 20 నుంచి 27వ తేదీ వరకు, రూ.50 అపరాధ రుసుంతో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 4 నుంచి 9వ తేదీ వరకు తత్కాల్ రుసుంతో పదవ తరగతికి రూ.500, ఇంటర్‌కు రూ.1,000 అపరాధ రుసుంతో పాటు, ఆయా సబ్జెక్టులకు నిర్దేశిత పరీక్ష ఫీజును ఏపీ ఆన్‌లైన్, ఏపీ ఓఎస్ఎస్ ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. వివరాలకు 89776 45704 ఫోన్ చేయవచ్చు.

కాపు నేతలకు నివాళి



రంగా, నాగేశ్వరరావు విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీలు, నాయకులు

అమలాపురం టౌన్: స్థానిక నల్లవంతెన వద్ద కాపు నాయకులు వంగవీటి మోహనరంగా, జక్కంపూడి నాగేశ్వరరావు విగ్రహాలకు ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, వైఎస్సార్ సీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు పూల మాలలు వేశారు. గురువారం వారి వర్ధంతిని నిర్వహించారు. ఎమ్మెల్సీలు వారి సేవలను కొనియాడారు. దివంగత నాగేశ్వరరావు కుమారుడు రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ ఆధ్వర్యంలో మోహనరంగా, నాగేశ్వరరావులు వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. ఆ ఇద్దరి దివంగ నేతల విగ్రహాలకు నివాళులర్పించిన తర్వాత స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంచిపెట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, రాష్ట్ర కాపు నాయకుడు కల్వకొలను తాతాజీ, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, గన్నవరపు శ్రీను, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, పార్టీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్ రాజా, జిల్లా దివ్యాంగుల సంఘం గౌరవాధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు పాల్గొన్నారు.

చర్చలో పాల్గొందాం.. ప్రధానితో మాట్లాడదాం

- పరీక్ష పే చర్చ 8వ ఎడిషన్‌కు ఆహ్వానం
- 6-12 విద్యార్థులకు పాల్గొనే అవకాశం
- ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కూడా..
- ఆన్‌లైన్‌లో నమోదుకు జనవరి 14 తుది గడువు



పాఠశాల విద్యార్థులు



రాయవరం: ప్రధానమంత్రితో నేరుగా మాట్లాడాలనుకుంటున్నారా..అయితే ఆ అవకాశం ఇప్పుడు మీ చేతుల్లోనే ఉంది. మీరు చేయాల్సిందల్లా ప్రధానమంత్రి 'పరీక్ష పే చర్చ' యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు కావడమే. ఏటా పరీక్షల ముందు 'పరీక్ష పే చర్చ' కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ఈ కార్యక్రమం ఇప్పుడు 8వ ఎడిషన్‌కు సన్నద్ధమవుతోంది. దేశ వ్యాప్తంగా బోర్డు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేరుగా సంభాషించనున్నారు. పరీక్షలను ఒత్తిడి లేకుండా ఎదుర్కోవడం ద్వారా పరీక్షలంటే భయాన్ని తొలగించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదుకు....

మార్చి1 నుంచి ఇంటర్, మార్చి 17 నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు ఎలా సన్నద్ధమవ్వాలి.. వారు ఎదుర్కొనే సవాళ్లు ఏమిటి? ఎలా అధిగమించాలి? విద్యార్థుల ఆకాంక్షలు ఏమిటి? వాటిని చేరుకోవడానికి అనుసరించాల్సిన మార్గాలు ఏమిటి? పరీక్షల సమయంలో విద్యార్థులు ప్రశాంతంగా.. ఎలా ఉండాలి? ఇలా పలు అంశాలపై 'పరీక్షా పే చర్చ' జరుగుతుంది. పాల్గొనేందుకు 9-12 తరగతులు చదివే విద్యార్థులు అర్హులు.

2018లో మొదటి ఎడిషన్ ప్రారంభం

'పరీక్ష పే చర్చ' మొదటి ఎడిషన్ 2018 ఫిబ్రవరి 16న ఢిల్లీలోని తాల్కటోరా స్టేడియంలో నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రశ్నను ప్రధానమంత్రిని నేరుగా అడగవచ్చు. ప్రశ్న గరిష్టంగా 500 అక్షరాల లోపు ఉండాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా 'పరీక్ష పే చర్చా'లో పాల్గొనవచ్చు. వారి ఎంట్రీలను కూడా ఆన్‌లైన్‌లో పంపే అవకాశం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కల్పించింది.

చర్చించే అంశాలు (విద్యార్థులకు)

మీ స్వాతంత్ర్య సమరయోధులను తెలుసుకోండి. మన సంస్కృతి మన గర్వం. నా పుస్తకం నా ప్రేరణ. భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని కాపాడండి. నా జీవితం, నా ఆరోగ్యం. నా స్టార్టప్ కల. ఎస్‌టీఈఎం విద్య/హద్దులు లేని విద్య.

ఉపాధ్యాయుల కోసం

మన వారసత్వం. అభ్యాస పర్యావరణాన్ని ప్రారంభించడం. నైపుణ్యం కోసం విద్య. తక్కువ కరిక్యులర్ లోడ్. పరీక్షలకు భయం లేని వాతావరణం. భవిష్యత్తు విద్య సవాళ్లు.

తల్లిదండ్రుల కోసం

నా బిడ్డ, నా గురువు. వయోజన విద్య. కలిసి నేర్చుకోవడం, పెరగడం.

లాగిన్ అవ్వాలిలా..

విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లింక్‌ను క్లిక్ చేసి, మొబైల్ నంబర్ లేదా జీ మెయిల్ ఖాతాను పూర్తి చేయాలి. ఓటీపీతో లాగిన్ అయి క్లిక్ చేయాలి. ఓటీపీ రాగానే మళ్లీ లాగిన్ చేయాలి. ప్రాథమిక సమాచారం వివరాలను పూర్తి చేయాలి. కార్యాచరణ వివరాలను పూర్తి చేసిన తర్వాత థీమ్‌ను ఎంచుకుని 1,500 అక్షరాల లోపు వివరించాలి. ఈ కార్యక్రమం నిర్వహణకు జిల్లా స్థాయిలో సైన్స్ అధికారులు కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారు. అధిక సంఖ్యలో పరీక్ష పే చర్చలో పాల్గొనేలా మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలి. ఎంపికైన 2,050 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు విద్యామంత్రిత్వ శాఖ ద్వారా పీపీసీ కిట్‌లను బహుమతిగా అందజేయనున్నారు.

విజేతలుగా నిలిస్తే

ఈ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన వారు నేరుగా ప్రధానమంత్రిని కలుసుకునే అవకాశాన్ని పొందుతారు. విజేతకు ప్రత్యేక పరీక్షా పే చర్చా కిట్, ప్రశంసా పత్రాన్ని అందజేస్తారు. విజేతలు ప్రధానమంత్రి ఆటోగ్రాఫ్‌ను, ఫొటోతో కూడిన డిజిటల్ సావనీర్‌ను పొందే అవకాశముంది. టాప్ 10 లెజండరీ ఎగ్జామ్ వారియర్స్ ప్రధాని నివాసాన్ని సందర్శించే అవకాశాన్ని పొందుతారు.

జిల్లాకు గుర్తింపు తీసుకురావాలి



ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని 6-12 తరగతులకు చెందిన విద్యార్థులకు ఇది చక్కని అవకాశం. విద్యార్థులతో పాటుగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చర్చలో పాల్గొనే అవకాశాన్ని సాధించడం ద్వారా జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు తీసుకురావాలి.

– డాక్టర్ షేక్ సలీం బాషా, డీఈవో, అమలాపురం

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తాళ్లపూడి: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన వేగేశ్వరపురంలో చోటు చేసుకుంది. తాళ్లపూడి ఎస్సై టి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వేగేశ్వరపురం గ్రామానికి చెందిన పడాల శ్రీరామ రామకుమార్ రాము(28) ఈ నెల 16వ తేదీన ఆర్థిక ఇబ్బందుల వల్ల గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇప్పటి వరకు కాకినాడ గవర్నమెంట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్టు తెలిపారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు తాళ్లపూడి ఎస్సై రామకృష్ణ తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుక్కలు అడ్డు రావడంతో ఆటో బోల్తా

– వృద్ధుడి మృతి, ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో మృతిచెందిన పల్లయ్య

పి.గన్నవరం: మండలంలోని జి.పెదపూడి గ్రామం వద్ద గురువారం మధ్యాహ్నం కుక్కలు అడ్డు రావడంతో ఒక ఆటో అదుపు తప్పి రోడ్డుపై బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో కింద పడి ఒక వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్‌తో పాటు, మరొక మహిళకు గాయాలు అయ్యాయి. మరో ఇద్దరు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పి.గన్నవరం సెంటర్ నుంచి ఈతకోట గ్రామానికి ముగ్గురు ప్రయాణికులతో ఆటో వెళ్తోంది. ముమ్మిడివరం మండలం కొమానపల్లి గ్రామానికి చెందిన సవరపు పల్లయ్య (60) ఊడిమూడి గ్రామం వద్ద ఆటో ఎక్కాడు. జి.పెదపూడి వంతెన సమీపంలో వారు ప్రయాణిస్తున్న ఆటోకు కుక్కలు అడ్డురావడంతో డ్రైవర్ బ్రేక్ వేశాడు. దీంతో అదుపు తప్పిన ఆటో రోడ్డుపై పల్టీ కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న పల్లయ్య రోడ్డుపై పడగా, అతని మీద ఆటో పడింది. పల్లయ్య తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న వై.కొత్తపల్లికి చెందిన వెల్ల వీరవేణి తలకు గాయాలు కావడంతో ఆమెను స్థానికులు 108 అంబులెన్స్‌లో పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతోంది. యర్రంశెట్టివారిపాలెంనకు చెందిన ఆటో డ్రైవర్ చాగంటి సతీష్‌కు గాయాలు అయ్యాయి. పల్లయ్య మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు.

ఎవరా పెద్దాయన?

- కోడి పందేల బరుల కోసం పైరవీలు
- ఆయనకు రూ.10 లక్షలు ఇచ్చుకోవాలన్న ఆడియో హల్‌చల్
- రామచంద్రపురం బరులపై రౌడీషీటర్ గుత్తాధిపత్యం


కోడిపందేల బరి (ఫైల్)



రామచంద్రపురం: సంక్రాంతి నెల గంట మోగిందో లేదో అప్పుడే కోడిపందేల బరుల హడావుడి మొదలైంది. ఎవరు ఎక్కడ కోడి బరులు వేసుకోవాలనే దానిపై కూటమి నేతలు వాటాలు వేసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. కాకినాడ జిల్లా కరప మండలం విజయరాయుడుపాలెంలో కోడిపందేల బరి కోసం ఇద్దరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ చర్చకు దారి తీసింది. 'కాకినాడ రూరల్ ఎమ్మెల్యేకు ఇప్పుడే రూ.10 లక్షలు ఇచ్చి వచ్చాను. ఇక్కడ పెద్దాయనకు కూడా రూ.10 లక్షలు ఇవ్వాల్సిందే' అంటూ సాగిన సంభాషణ చర్చనీయాంశమైంది. రామచంద్రపురం నియోజకవర్గంతో పాటు కాకినాడ రూరల్ నియోజకవర్గంలో రెండు రోజులుగా సోషల్ మీడియా గ్రూపుల్లో ఈ సంభాషణ హల్‌చల్ చేస్తోంది. కోడి పందేల బరుల్లో ఎలా వాటాలు పంచుకోవాలనే దానిపై జరుగుతున్న ప్రయత్నాలకు ఇది అద్దం పడుతోంది. కోడి పందేల బరులను అమ్మకాలకు పెట్టి మధ్యవర్తుల ద్వారా బేరసారాలు సాగిస్తున్నారు. ఎక్కడ కోడి పందేలు వేయాలి, ఎవరి అనుగ్రహం పొందాలి, ఎంతెంత సమర్పించుకోవాలనే దానిపై నియోజకవర్గానికి చెందిన ఒక పెద్దాయన ఇప్పటికే ఒక టీమ్‌ను ఏర్పాటు చేసినట్టు గుసగులాడుకుంటున్నారు.

గతంలో ఇలా..

వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ కోడి పందేల నిర్వహణను పూర్తిగా వ్యతిరేకించి సంక్రాంతికి రెండేళ్ల పాటు రామచంద్రపురం నియోజకవర్గంలో నిషేధించారు. నియోజకవర్గంలో ఎక్కడా కోడి పందేల బరులు ఏర్పాటు చేయనివ్వలేదు. సంప్రదాయబద్ధంగా సాంస్కృతిక కార్యక్రమాలతో మూడు రోజులపాటు పండుగ సంబరాలను నిర్వహించారు. దానికి పూర్తి విరుద్ధంగా 20 రోజుల ముందుగానే కోడి పందేల బరుల కోసం పైరవీలు చేయడం శోచనీయమని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పెద్దాయన రూ.10 లక్షలు అడిగారని సోషల్ మీడియాలో వచ్చిన ఆడియో ఆసక్తికరంగా మారింది. ఎవరీ పెద్దాయన! అంటూ ఒకరినొకరు ప్రశ్నించుకుంటున్నారు. ఓ రౌడీషీటర్ నియోజకవర్గంలోని మొత్తం బరులపై గుత్తాధిపత్యం చెలాయిస్తున్నట్టు కోడి పందేల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ రౌడీషీటర్ పెద్దాయనతో మాట్లాడుకుని వ్యవహారాన్ని చక్కబెడుతున్నాడా..? లేక తనే సొంతంగా బరుల వద్ద వసూళ్లకు పాల్పడుతున్నాడా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పెద్దాయనకు వాటాలు ఇవ్వడంతోపాటు మొత్తం మీద కోడి పందేల నిర్వహణదారుల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. అందరికీ ఇలా ఇచ్చుకుంటూ పోతే మాకేం మిగులుతుందని పందేల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, ఆ రౌడీషీటర్ చేస్తున్న నిర్వాకానికి పెద్దాయన ఎలా వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అతిగా మద్యం తాగిన వ్యక్తి మృతి


అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన అపరిచిత వ్యక్తి

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం సమీపంలోని ఈదరపల్లి రోడ్డులో 30 ఏళ్ల ఓ అపరిచిత అతిగా మద్యం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లి స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఈదరపల్లిలో రోడ్డులో పాడుపడిన ఓ సినిమా థియేటర్ వద్ద మద్యం మితిమీరి సేవించి ఆ వ్యక్తి తన పేరు, ఊరు చెప్పే స్థితిలో కూడా లేకుండా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో స్థానికులు అతడిని మధ్యాహ్నం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి అతడిని మామూలు స్థితిలోకి తీసుకుని వచ్చేందుకు వైద్యులు శ్రమించారు. చివరకు అతడు సాయంత్రం మృతి చెందినట్లు పట్టణ ఎస్సై కిషోర్‌బాబు తెలిపారు. మితిమీరి మద్యం సేవించడంతో పాటు అతడికి వేరే రుగ్మత ఏమైనా ఉండడం వల్లే చనిపోయాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మాసిన దుస్తులతో ఉన్న ఆ వ్యక్తి ఎక్కడ నుంచో ఇక్కడకు వచ్చినట్లు తెలుస్తోంది. ఏదైనా పని నిమిత్తం ఈ ప్రాంతానికి వచ్చాడా లేదా మరేదైనా కారణంతో గతి తప్పి ఇక్కడకు వచ్చాడా...? అనే దిశగా విచారిస్తున్నారు. ఆ అపరిచిత వ్యక్తి మృతదేహాన్ని కుటుంబీకులు, బంధువులు, తెలుసున్నవారు గుర్తిస్తే పట్టణ పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై కిషోర్‌బాబు సూచించారు. మృతదేహం సమాచారాన్ని 8143579127 ఫోన్ నెంబర్‌కు అందించాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతానికి ఆ మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఉంచినట్లు చెప్పారు.

ఆర్థిక ప్రమాణాల పెంపునకు కృషి

జాతీయ రైతు దినోత్సవంలో సీటీఆర్ఐ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ సరళ


ఉత్తమ రైతులను సత్కరించిన ఐసీఏఆర్-సీటీఆర్ఐ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ సరళ, తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పొగాకు రైతుల సామాజిక, ఆర్థిక ప్రమాణాల మెరుగుదలకు తమ సంస్థ కృషి చేస్తోందని ఐసీఏఆర్-సీటీఆర్ఐ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ కె.సరళ అన్నారు. స్థానిక కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ(సీటీఆర్ఐ)లో గురువారం జాతీయ రైతు దినోత్సవం (కిసాన్ దివస్) నిర్వహించారు. అధ్యక్షత వహించిన డాక్టర్ సరళ మాట్లాడుతూ పర్యావరణ అనుకూలిత స్వచ్ఛమైన పొలం (స్వచ్ఛ ఖేతి/క్లీన్ ఫార్మ్ కాన్సెప్ట్)ను సాధించే దిశగా ఆచరణాత్మక పరిష్కారాలు, అత్యుత్తమ విధానాలపై రైతులు దృష్టి సారించేలా కిసాన్ దివస్ నిర్వహించామన్నారు. పొగాకు దిగుబడులను హెక్టారుకు 3,000 కిలోల స్థాయి నుంచి పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. పంట యాజమాన్యంలో తలెత్తే సమస్యలు, ఇతర అంశాలపై సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు తక్షణమే స్పందిస్తారని ఆమె తెలిపారు. స్వచ్ఛభారత్ అభియాన్ నోడల్ అధికారి డాక్టర్ కె.సుమన్ కళ్యాణి కిసాన్ దివస్ ప్రాముఖ్యతను వివరించారు. పోస్ట్ హార్వెస్ట్ అండ్ వాల్యూ అడిషన్ విభాగాధిపతి డాక్టర్ ఎల్ కే ప్రసాద్ మాట్లాడుతూ పొగాకు ఎక్కువగా పురుగుమందులపై ఆధారపడే పంట కాబట్టి జీఆర్ఎల్ కంటే తక్కువ అవశేషాలతో ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. పీఎంఈ సెల్ నోడల్ అధికారి డాక్టర్ కస్తూరి కృష్ణ మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రభుత్వం ఈ విషయంలో రైతులను ఆదుకోవాలని తెలిపారు. అభ్యుదయ రైతులు సత్రం వెంకటరావు, ఇల్లూరి రాంబాబు వారి అనుభవాలను పొగాకు శాస్త్రవేత్తలతో పంచుకున్నారు. తమ ఎంఎల్ఎస్ నేలలకు నికోటిన్ అధిక స్థాయిలో ఉన్న మంచి అధిక దిగుబడినిచ్చే మేలిరకం పొగాకును అభివృద్ధి పరచవలసిందిగా వారు శాస్త్రవేత్తలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతులు సత్రం వెంకటరావు (చల్లావారి గూడెం)- జంగారెడ్డిగూడెం ఏపీఎఫ్-2, ఇల్లూరి రాంబాబు (వెల్లచింతలగూడెం) గోపాలపురం ఏపీఎఫ్, నులకాని సుబ్రహ్మణ్యం (అక్కంపేట)- జంగారెడ్డిగూడెం-1 ఏపీఎఫ్, కోయ వెంకటేశ్వరరావు (వెలచింతలగూడెం)- గోపాలపురం ఏపీఎఫ్, ఎస్.రాంబాబు (మైసన్నగూడెం)లను సత్కరించారు.

కాలువలో మునిగి చిన్నారి మృతి


బల్లిపాడులో బాలుడి ఇంటి సమీపంలో ప్రవహిస్తున్న కాలువ


బల్లిపాడులో కాలువలో పడి మృతి చెందిన నాలుగేళ్ల బాలుడు

బల్లిపాడులో విషాదం

తాళ్లపూడి : ఆడుకుంటూ కాలువలో పడి నీట మునిగి నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన బల్లిపాడులో గురువారం చోటు చేసుకుంది. తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బల్లిపాడు ఎస్సీలు నివసించే ప్రాంతంలో గల తలపాకుల జాన్సీ రాణి నాలుగేళ్ల కుమారుడు ఆద్విత్‌కుమార్ ఆడుకుంటూ ఇంటి సమీపంలోని కాలువలో పడి మునిగిపోయాడు. ఎవరూ చూడకపోవడంతో మునిగిన వెంటనే మృతి చెందాడు. ఈ ప్రాంతంలో వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం పంట కాలువ నీరు దాదాపు గట్టుకు సమాంతరంగా వెళుతూ ఉంటుంది. ఆడుకుంటూ వెళ్లి కాలువ నీటిలో ప్రమాదవశాత్తూ పడి మునిగిపోయి తన చిన్నారి మృతి చెందాడని బాలుడి తల్లి తలపాకుల జాన్సీరాణి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఘటనా ప్రదేశానికి పోలీసులు చేరుకుని వివరాలను సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు.

పాత నేరస్తులపై నిఘా

- డ్రోన్ల సహాయంతో గంజాయిపై ప్రత్యేక దృష్టి
- శలపాక, వేట్లపాలెంలో హత్యలు దురదృష్టకరం
- ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్


కాకినాడ రూరల్ సర్కిల్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్

కాకినాడ రూరల్: పాత నేరస్తులపై నిరంతరం నిఘా పెడుతున్నామని దీనివల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం సర్పవరం జంక్షన్ వద్ద రూరల్ సర్కిల్ పోలీసు కార్యాలయంలో రికార్డులను ఆయన తనిఖీ చేశారు. పలు కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించి వాటి దర్యాప్తు, తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఐజీ అశోక్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ గంజాయి రవాణా అరికట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. డ్రోన్ల సహాయంతో గంజాయి సమాచారం సేకరించి చర్యలు చేపడుతున్నామని, ఈ మధ్యకాలంలో గంజాయి నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. మహిళలపై నేరాల అదుపునకు ప్రత్యేక దృష్టి పెట్టామని, చిన్న పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి వారికి త్వరగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ నేరగాళ్లు భయపెడుతున్నారన్నారు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు ప్రజలు వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 19000కి మూడు గంటల లోపు సమాచారం ఇవ్వాలన్నారు. కాకినాడ జిల్లాలో కాజులూరు మండలం శలపాక, సామర్లకోట మండలం వేట్లపాలెంలో జరిగిన హత్యలు దురదృష్టకరమన్నారు. వ్యక్తిగత తగాదాల కారణంగా రెండు చోట్ల జరిగిన హత్యల నేపథ్యంలో గ్రామాలలో జరిగే చిన్న చిన్న గొడవలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులను ఆదేశించామన్నారు. డీఐజీతో పాటు ఎస్పీ విక్రాంత్‌పాటిల్, ట్రైనీ ఏఎస్పీ సుష్మిత, కాకినాడ ఇన్‌చార్జి డీఎస్పీ రామచంద్రరావు, సీఐ చైతన్యకృష్ణ, వివిధ పోలీసు స్టేషన్ల ఎస్సైలు ఉన్నారు.

10 కేజీల గంజాయి పట్టివేత


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీహరిరాజు

ఏలేశ్వరం: మండల పరిధిలోని యర్రవరం జాతీయ రహదారిపై 10 కేజీల గంజాయి పట్టుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు గురువారం విలేకరులకు వివరాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు యర్రవరం జాతీయ రహదారిపై సీపీఎఫ్ కంపెనీ వద్ద కర్ణాటకకు చెందిన నాయజ్‌పాషా కారులో తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. దీంతో పాటు రూ.65వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశామన్నారు. ముద్దాయికి గంజాయి సరఫరా చేసిన ఒడిశా రాష్ట్రానికి చెందిన సమంత కంహర్‌ను అరెస్టు చేయవల్సి ఉందన్నారు. సీఐ సూర్యఅప్పారావు, ఎస్సై రామలింగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అందివచ్చిన కొడుకులు అనంతలోకాలకు..

- అదుపు తప్పి చెట్టును ఢీకొన్న బైక్
- ఇద్దరు యువకుల మృతి
- మృత్యువులోనూ వీడని స్నేహబంధం


ఘటనా స్థలంలో మృతదేహాలను పరిశీలిస్తున్న అన్నవరం ఎస్సై హరిబాబు


వెంకటరమణ పుట్టినరోజు సందర్భంగా కేకు తినిపిస్తున్న సుబ్రహ్మణ్యం (ఫైల్)

శంఖవరం: అందివచ్చిన కొడుకులు తమకు అండగా ఉంటారనుకుంటే రోడ్డు ప్రమాదం వారిని పొట్టన పెట్టుకుందని ఆ తండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. శంఖవరం మండలం పెద మల్లాపురం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. చిన్ననాటి స్నేహితులు ఇద్దరూ ఒకేసారి మరణించడాన్ని కుటుంబీకులు తట్టుకోలేకపోతున్నారు. ఒకే ప్రాంతంలో చెట్టా పట్టాలు వేసుకుని తిరిగిన వారి స్నేహ బంధం మరణంలోనూ వీడలేదు. మండలంలోని పెద మల్లాపురం గ్రామానికి చెందిన బలుం సుబ్రహ్మణ్యం (24), బోడోజు వెంకటరమణ(18) బుధవారం రాత్రి సమీపంలోని వేళంగి గ్రామానికి బైక్‌పై వెళ్లారు. అక్కడ పని ముగించుకొని తిరిగి బయలు దేరారు. ఇంటికి కూతవేటు దూరంలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవ్ చేస్తున్న వెంకటరమణ, వెనుక కూర్చున్న సుబ్రహ్మణ్యం తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారాన్ని అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న బలుం సుబ్రహ్మణ్యం గతంలో బాకీ ఉన్న ఆటో కిరాయి సొమ్ము వసూలు చేసుకోవడానికి వేళంగి వెళ్తున్నట్లు ఇంటి వద్ద చెప్పి వెళ్లి ప్రమాదానికి గురయ్యాడు. అతని తండ్రి బలుం కన్నయ్య గుండెలు పగిలేలా విలపించాడు. తన పెద్ద కుమారుడికి ఇటీవల వివాహం జరిపించానని, సుబ్రహ్మణ్యానికి వివాహం జరిపించేందుకు సంబంధాలు చూస్తుండగా ఈ ఘోరం జరిగిందని కన్నీరుమున్నీరుగా విలపించాడు. బోడోజు వెంకటరమణ ఇంటర్మీడియెట్ చదువుకున్నాడని, ఉద్యోగం చేసి కుటుంబాన్ని పోషిస్తాడనుకున్నానని, ఇలా అర్ధంతరంగా వెళ్లిపోయాడని తండ్రి బోడోజు రాజు కన్నీటి పర్యంతం అయ్యాడు. సమాచారం అందుకున్న అన్నవరం ఎస్సై హరిబాబు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మృతదేహాలను తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

హెల్మెట్ వినియోగంపై చైతన్య యాత్ర

రాజానగరం: బైకులపై ప్రయాణించే వారే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రమాదాలలో తలకు గాయం తగలడంతోనే ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బైకులపై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోర్టుల ఆదేశాలతో పోలీసుశాఖ, రవాణా శాఖ తరచు అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. తమ వంతు బాధ్యతగా హైదరాబాద్‌కి చెందిన డాక్టర్ వెంకట్ కోసూరి, డాక్టర్ నరేష్ పిన్నింటి, వంశీ బరిగే, కృష్ణచైతన్య కరణం, శ్రీకృష్ణ బాలాంత్రపు, డేనిల్ బెన్ని (ఇద్దరు వైద్యులు, నలుగురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు) హెల్మెట్ వినియోగంపై ప్రచారం నిర్వహించి, ప్రజలలో చైతన్యం తీసుకురావాలనే ఆలోచనతో హైదరాబాద్ టు కాకినాడ, కాకినాడ టు హైదరాబాద్‌కు తొమ్మిది రోజుల బైకు యాత్రను చేపట్టారు. కాకినాడకు చేరుకుని, తిరిగి వెళ్లే క్రమంలో దివాన్‌చెరువులో కలిసిన స్థానిక మీడియాకు డాక్టర్ నరేష్ పిన్నింటి యాత్ర వివరాలను తెలియజేశారు. బైకులపై ఈనెల 21న హైదరాబాద్ నుంచి బయలుదేరి విజయవాడ, మచిలీపట్నం, దిండి, రావులపాలెం, అమలాపురం, యానాం, కాకినాడ వెళ్లి తిరిగి రాజానగరం, రాజమహేంద్రవరం, భీమవరం, బాపట్ల మీదుగా 29 నాటికి హైదరాబాద్‌కి చేరుకుంటామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అనేక రోడ్డు ప్రమాదాలలో బైకులపై ప్రయాణించే వారే ఎక్కువగా బలైపోతున్నారన్నారు. తలకు హెల్మెట్, చేతులకు గ్లౌజ్, జాకెట్ వేసుకోవడం వల్ల ప్రమాదాల నుంచి చాలావరకు తప్పించుకునే అవకాశం ఉంటుందన్నారు. దీనిపై ప్రజలలో చైతన్యం తీసుకురావడంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకృతి అందాలను కూడా ఆస్వాదించే విధంగా తమ యాత్ర సాగుతోందన్నారు. ఈ యాత్రను యావత్తూ చిత్రీకరించే విధంగా వారు ధరించిన హెల్మెట్‌లకు ప్రత్యేక కెమెరాను ఏర్పాటు చేసుకున్నారు.


బైకు యాత్ర చేస్తున్న హైదరాబాద్ వాసులు


యాత్ర చిత్రీకరణ కోసం డాక్టర్ నరేష్ పిన్నింటి హెల్మెట్‌కి బిగించిన ఉన్న కెమెరా